

రోగుల నుంచి అదనంగా వసూలు చేస్తే చర్యలు

నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నెట్ వర్క్ ఆసుపత్రులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులతో శుక్రవారం జిల్లాస్థాయి డిసిప్లీనరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ ద్వారా రోగుల నుంచి సేకరించిన ప్రజాభిప్రాయ నివేదికలను సమీక్షించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో లబ్ధిదారులు అందరికీ పారదర్శకంగా ప్రయోజనం అందాలన్నారు. ఈ పథకం కింద రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు, చికిత్స అందించడంతో పాటు ఎంప్లాయిా హెల్త్ స్కీం, జర్నలిస్టు హెల్త్ స్కీం కింద ఉద్యోగులు, జర్నలిస్టులకు ఉచిత వైద్యం తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేశారు. అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలని ఆదేశించారు. ప్రి ఆథరైజేషన్ అభ్యర్థనలు అనవసరంగా అధికంగా ఎందుకు నమోదవుతున్నాయో కారణాలు తెలపాలని ఆసుపత్రులు ప్రతినిధులను ప్రశ్నించారు. డెంటల్ ఆసుపత్రులు ప్రీమియం ఇంప్లాంట్స్ పేరుతో అదనపు వసూళ్లు చేయకుండా పథకం ప్రకారం సేవలు ఉచితంగా అందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ, ఎన్టీఆర్ వైద్యసేవల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



థాంక్యూ సీఎం సార్!


రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : థాంక్యూ సీఎం సార్ అంటూ మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్త్రీ శక్తి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం సాయంత్రం పాలాభిషేకం చేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల జీవితాల్లో వెలుగులు నింపిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ తదితరులు పాల్గొన్నారు

ఓ బొజ్జ గణపయ్య!

జిల్లాలో ఎక్కడికక్కడ భారీ గణనాథుల విగ్రహాలు వెలిశాయి.. చాలాచోట్ల పోటాపోటీగా విగ్రహాలు ఏర్పాటు చేశారు.. జిల్లా వ్యాప్తంగా 5 వేల విగ్రహాలు ఏర్పాటు చేయగా.. ఒకదానిని పోలి మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో.. విగ్రహాల తయారీదారులు రకరకాల ఆకరణల్లో వినాయకుడి విగ్రహాలను తయారుచేసి విక్రయించారు.. దీంతో భక్తజనం ప్రత్యేకంగా రూపొందించిన విగ్రహాలను చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.. భారీ విగ్రహాల వద్ద జనం క్యూకడుతున్నారు.. ఈ చిత్రంలో చూస్తున్న విగ్రహం గోకవరంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 అడుగులు ఉంది. భారీకాయుడి ఆకారాన్ని పోలి ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది.ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. - **గోకవరం**



పాస్.. కాలేదు!



తప్పుల తడకగా పాస్ పుస్తకాలు

- ఉమ్మడి జిల్లాకు 3.44 లక్షలు
- 40 వేల పుస్తకాల్లో అన్నీ తప్పులే
- పంపిణీ తాత్కాలిక వాయిదా
- రైతాంగానికి మళ్లీ నిరాశ
- ఆన్‌లైన్‌లో సరిచేస్తున్న అధికారులు
- మార్చి కొత్తగా ఇవ్వాలని నిర్ణయం
- గత వైసీపీలో జగన్ బొమ్మ
- కూటమిలో ప్రభుత్వ రాజముద్ర

(కాకినాడ/సామర్లకోట,ఆంధ్రజ్యోతి)

పట్టాదారు పాసుబుక్‌లకు ఎదురుచూస్తున్న రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. గత వైసీపీ హయాం నుంచీ వీటి కోసం అన్నదాతలు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగని రోజు లేదు.ప్రభుత్వం మారాక ఎట్టకేలకు కొత్త పుస్తకాలు ముద్రణ పూర్తయి జిల్లాకు చేరుకున్నాయి. రేపో మాపో పుస్తకం చేతికి వస్తుందనుకున్న తరుణంలో వాటిలో చోటుచేసుకున్న భారీ తప్పులు అధికారులు, కొన్నిచోట్ల రైతులు గుర్తించారు. దీంతో అధికారులు వెనక్కు పంపేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరి చేసి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చేరుకున్న 3.44 లక్షల పాస్‌బుక్‌ల పంపిణీ నిలిపివేశారు.

40 వేల పుస్తకాలు వెనక్కు..

కాకినాడ జిల్లాలో 6,900 పుస్తకాలు తప్పుల తడకగా మారాయి. ఉమ్మడి జిల్లా అంతా కలిపి 40 వేల వరకు పుస్తకాలు ఎందుకు పనికిరాకుండా మారాయి. ఇప్పటికే లాంఛనంగా పంపిణీ చేసిన చోట తప్పులు చూసి అన్నదాతలు లబోదిబోమనడంతో అవన్నీ వెనక్కు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసింది. తప్పులు దొర్లిన పాసు పుస్తకాలన్నింటినీ తాజాగా అమరావతికి వెనక్కు పంపేసింది. ఏ రైతు పుస్తకానికి సంబంధించి తప్పులున్నాయో వాటిని ఆన్‌లైన్ యాప్ ద్వారా సరిదిద్దుతున్నారు.ఈ వివరాల ఆధారంగా మళ్లీ కొత్త పుస్తకాలు రానున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న పాసు పుస్తకాల పంపిణీ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. త్వరలో ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ చేయించాలని భావిస్తోంది.

వైసీపీలో ఇబ్బందే..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అస్తవ్యస్తంగా మారింది. రైతులు భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా కనీసం పాస్ బుక్‌లు ఇవ్వలేదు. వాస్తవానికి పాస్‌బుక్‌లు ఉంటేనే భూముల క్రయవిక్రయాలు, రైతులకు రుణాలు వస్తాయి. కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. రైతులు పాస్‌పుస్తకాలకు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూసర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ క్రయవిక్రయ లావాదేవీలు జరిగాయి. 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి.ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. వందేళ్ల తర్వాత గత వైసీపీ ప్రభుత్వం సర్వేశాఖ ద్వారా సమగ్ర భూసర్వే చేయడానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేపై విపరీతమైన ఒత్తిళ్లు తేవడంతో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను మార్చేశారు. ఉమ్మడి జిల్లాలో 600కుపైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇందులో కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండ లాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. రీసర్వే తప్పుల తడకగా మారింది. వీటిని సరిచేయాలని ఉమ్మడి జిల్లాలో వేలాది మంది బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. ఇదిలా ఉండగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది తీవ్ర విమర్శలపాలైంది.

పొరపాట్లను సరిచేశారనుకుంటే..

ఈ పొరపాటును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిదిద్దింది. కేవలం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించింది. ఇలా ఉమ్మడి జిల్లాకు కొత్తగా 3.44 లక్షల పాసు పుస్తకాలు వచ్చాయి. వీటిని తహశీల్దార్లు పరిశీలించి ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో తప్పులు దొర్లాయని కొందరు వీఆర్వోలు గుర్తించి తహశీల్దార్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో సమాలోచనలు చేశారు. అనంతరం ఆగస్టు 15నుంచి భూయజమా నులకు పంపిణీ చేయాల్సిన పాసుపుస్తకాల పంపిణీ కొంతకాలం వాయిదా వేశారు. ప్రభు త్వం ముందుగా నిర్ణయించిన సమాచారం మేరకు ఇప్పటికే పది రోజుల సమయం దాటి పోయింది. అయినా కొత్త పాసుపుస్తకాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లాలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో కొత్త పాస్ పుస్తకాలు తాత్కాలికంగా దాచి ఉంచారు.

ఇలా చేస్తే బెటర్..

వైసీపీలో రీసర్వే ప్రక్రియలో నాటి వీఆర్వోలు చేసిన తప్పిదాల కారణంగా పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లాయి. ఇలా పునరావృతం కాకుండా ఉండాలంటే భూయజమానుల పేర్లు, రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను థర్డ్ పార్టీ అధికారులతో సర్వే చేయించాలి. గతంలో వీఆర్వో ఫొటోతో కూడిన 1-బీ పత్రాలను రైతులకు పంపిణీ చేసేవారు. రైతుల నుంచి వాస్తవ సమా చార సేకరణ చేసేవారు. కానీ అలాకాకుండా ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న లోపాలతో ఉన్న పాసు పుస్తకాలను ముద్రించి వాటినే తిరిగి పంపిణీ చేయడంతో తప్పుల తడకగా మారుతున్నాయి. ఆ ప్రక్రియకు వీఆర్వోలను వినియోగించకూడదని, రెవెన్యూలో సుదీర్ఘ అనుభవంగల ఒక తహశీ ల్దార్ స్థాయి అధికారి తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగానే ఉన్నట్లు బయోమెట్రిక్ వేసిన రైతులకే పట్టా దారుపాసు పుస్తకాలు థర్డ్ పార్టీ అధికారులతోనే పంపిణీ చేయించాలంటున్నారు. తాజాగా వచ్చిన కొత్త పాసుపుస్తకాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ముద్రితమయ్యాయి.కొత్త పాసు పుస్తకాల్లో రైతు పొలం వద్దకు చేరేలా క్యూ ఆర్ కోడ్ ముద్రించడం విశేషం.



25 బార్లు 20 దరఖాస్తులు

- బార్‌ల దరఖాస్తుల్లో తప్పని డీలా
- ముందుకు రాని వ్యాపారులు
- నేడు లాటరీ ద్వారా కేటాయింపు

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బార్‌లకు దరఖాస్తులు ఉసూరుమంటూనే దాఖలయ్యాయి. నూతన బార్ పాలసీ ప్రకారం బార్‌ల అనుమతులకు దరఖాస్తుల సమర్పణకు ప్రభుత్వం తొలుత ఈ నెల 26 వరకూ గడువు విధించింది. అయితే స్పందన లేకపోవడంతో ఈ నెల 29 (శుక్రవారం) సాయంత్రం వరకూ పొడిగించింది. అయితే చివరి నిమిషంలో దరఖాస్తులు రావడం, కొందరికి అర్హత లేకపోవడం తదితర కారణాల వల్ల ఆలస్యం కావడంతో సమయాన్ని అర్ధరాత్రి 12 గంటల వరకూ పొడిగించారు. అయినప్పటికీ దరఖాస్తుల సంఖ్యలో కిక్కు రాలేదు. జిల్లాకు 22 సాధారణ, 3 కల్లుగీత కార్మికులకు బార్‌లు కేటాయించారు. సాధారణ కేటగిరీ కింద శుక్రవారంలోపు దరఖాస్తు సమర్పించాల్సి ఉంది. రాత్రి 9 గంటల సమయానికి 20 దరఖాస్తులు సమర్పించారు. ఇంకా ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో బార్‌కి కనీసం నాలుగు చొప్పున దరఖాస్తులు వస్తాయని అటు ప్రభుత్వం భావించగా ఏకంగా పదేసి వస్తాయని జిల్లా ఎక్సైజ్ అధికారులు ఊహించారు.ప్రస్తుత వ్యాపారులు వెనుకంజ వేయడంతో.. ఎలాగైనా విజయం సాధించాలనే ఉద్దేశంతో గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లకు కూడా వేలల్లో మెసేజ్‌లు పంపించారు. కానీ చివరికి డీలా ప్రభుత్వ ఖజానాకు గండి తప్పలేదు. బార్‌ల కేటాయింపునకు కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో లాటరీ నిర్వహించనున్నారు.

నేడు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శనివారం నగరంలో పర్యటిస్తారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన ఛైర్‌పర్సన్‌ను కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా సంక్షేమం, రక్షణ, హక్కుల పరిరక్షణ, జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు,అందుబాటులో ఉన్న వనరులు, భవిష్యత్తు కార్యాచరణ వంటి పలు అంశాలపై ఛైర్‌పర్సన్‌కి వివరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సూచనలు, మార్గదర్శకాలను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తోందని ఆమెకు కలెక్టర్, ఎస్పీ తెలిపారు. జేఎన్ రోడ్‌లోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జిల్లా స్థాయి అవగాహన సమావేశంలో పాల్గొంటారని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి.శ్రీదేవి తెలిపారు. మహిళా సాధికారత, భద్రత, హక్కులపై ప్రసంగిస్తారన్నారు. అనంతరం మహిళా పోలీస్ స్టేషన్‌ని సందర్శించి సాయంత్రం తిరుగు పయనమవుతారు.



ఉరకలై గోదావరి

7

పెరుగుతున్న వరద



జ్ఞాన సరస్వతీ పీఠంలో శుభలేక సుధాకర్ శైలజ దంపతులు

నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గాన గంధర్వుడు,పద్మవిభూషణ్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహాన్ని శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్ దంప తులు ఆవిష్కరించనున్నారు.ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో ఘంటసాల విగ్రహం చెంత ఎస్పీ బాలసుబ్రహ్మ ణ్యం విగ్రహాన్ని రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా పార్కు ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహావిష్కరణ అనంతరం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జీవీ రమణ సంగీత సారథ్యంలో సంగీత విభావరి నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. విగ్రహావిష్కరణకు హాజరైన శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ దంపతులు శుక్రవారం సాయంత్రం పుష్కర్ ఘాట్ వద్ద జ్ఞాన సరస్వతీ పీఠాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాకా కార్యదర్శి జివిరమణ,పీఠం నిర్వాహకుడు తోట సుబ్బారావు స్వాగతం పలికారు. గైడర్ పెన్ వర్క్స్ తరపున సుధాకర్‌శైలజ దంపతులకు,గంగుమళ్ళ లక్ష్మణరావు పెన్నులు బహూకరించారు.



కామరాజుపేటలో యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా.. ఏదయ!

- రైతులను వెన్నాడుతున్న ఎరువుల కొరత
- నేటికీ పూర్తిస్థాయిలో అందని వైనం
- కొరతలేదంటున్న వ్యవసాయాధికారులు
- సొసైటీల వద్ద రైతుల పడిగాపులు
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందని ఆరోపణలు

గోకవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులను యూరియా కొరత వెంటాడుతూనే ఉంది. సొసైటీల ద్వారా పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. రైతులకు అందుబాటులో యూరియా ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. దీనికి తోడు ప్రైవేట్ దుకాణాల వద్ద అధిక మొత్తాలకు విక్రయిస్తుండడంతో రైతులకు మరింత భారంగా మారింది. జిల్లాలో సుమారు 73 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు పడుతుండడంతో నీరు కొరత లేక పంట ఏపుగా ఎదుగుతోంది. ఈ తరుణంలో పంటకు యూరియా చాలా అవసరం. సాధారణంగా వరి వేసిన 20 రోజుల్లో ఎరువులు వేయాలి. లేకుంటే పంట చేతికందదు. ఎరువులు అందుబాటులో లేక ఇప్పటికీ పలువురు పూర్తిస్థాయిలో వేయలేదు. ఇప్పటి వరకు జిల్లాకు 47 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 19 మండలాలు ఉండగా ఒక్కో మండలానికి 1987 టన్నుల చొప్పున ఎరువులు సరఫరా చేశారు. మరో 300 టన్నులు చొప్పున ఇండెంట్ పెట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబు తున్నారు.అధికారులు చెబుతున్న లెక్కలు బాగు న్నా జిల్లాను ఎరువుల కొరత వేధిస్తోంది.

యూరియా ఏమైంది!

ఒక పక్క అధికారులు చూస్తే యూరియా కొరత లేదంటున్నారు..మరో పక్క రైతులు చూస్తే కొరత అంటున్నారు..ఆరంభం నుంచి యూరియాకు సొసైటీల వద్ద క్యూకడుతూనే ఉన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, కోరుకొండ, గోకవరం, చాగల్లు తదితర మండలాల్లో రైతులు యూరియాకు పడిగాపులు కాసిన ఘటనలు ఉన్నాయి. మరి ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా ఏమైపోయింది.. బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందా.?జిల్లా వ్యవసాయాధికారి లెక్కల ప్రకారం అదనంగా 4 వేల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశారు. మరి ఆ యూరియా అంతా ఏమైంది.. జిల్లా అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సి ఉంది. ప్రభుత్వం బస్తా యూరియా రూ.266కు విక్రయిస్తుండగా..ప్రైవేట్ వ్యాపారుల వద్ద అదే బస్తా రూ.350ల నుంచి రూ.400లకు విక్రయిస్తున్నారు. యూరియాకు డిమాండ్ పెరగడంతో కొంతమంది పక్క దారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇదీ జిల్లా అధికారుల లెక్క..

జిల్లాకు ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 61,692 మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉండగా ఆగస్టు నెలకే 47 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి.(అక్టో బరు వరకు) సుమారుగా 14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే 5 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఎక్కువగా దిగుమతి జరిగింది. జిల్లాలో 16,556 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి.వీటిలో యూరియా 1917 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2112, పొటాష్ 2411, కాంప్లెక్స్ 6462, సూపర్ పాస్ఫేట్ 3654 మెట్రిక్ టన్నులు.జిల్లాకు 26,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికి 19 వేల మెట్రిక్ టన్నులు అందింది. రైతుల సాగు చేసిన పంట విస్తీర్ణాన్ని బట్టి 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరిపోతుంది.4 వేల మెట్రిక్ టన్నులు అదనంగా సమకూర్చాం.ఇంకనూ (అక్టోబరు నెల వరకు) సుమారుగా 7,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుంది.రైతులు సాగు చేసిన పంట విస్తీర్ణం బట్టి యూరియా పంపిణీ జరుగుతుంది. అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి.

ఆర్ఎస్‌కేలు..అలంకారమా?

జిల్లాలో రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువుల అమ్మకాలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. దీనిపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆర్‌బీకేల వద్ద అమ్మకాలు జరిగాయి.కూటమి ప్రభుత్వంలో ఆర్ఎస్‌కేల వద్ద ఎరువుల విక్రయాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం ఆ బాధ్యతలు మోయలేక తప్పించుకోవాలనే ధోరణిలో ఉన్నారు.గోకవరం సొసైటీ పరిధిలో ఇంత వరకు 70 టన్నులు, కామరాజుపేట సొసైటీ పరిధిలో 50 టన్నులు మాత్రమే యూరియా రైతులకు అందగా రెట్టింపు యూరియా అందాల్సి ఉంది.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి : కలెక్టర్



రీసర్వేపై లెక్కలు తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం రీ సర్వే, స్వమిత్వ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.కోరుకొండ ఎంపీడీవో కార్యాల యంలో శుక్రవారం స్వమిత్వ,రీ సర్వే పనులపై కలెక్టర్ సమీక్షించారు. రీ సర్వే లో ఇంకా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పర్యవేక్షణాధికారులు తమ బాధ్యతలను ఖచ్చితంగా నిర్వర్తించాలన్నారు. ప్రజలకు పౌర సేవలు అందించే క్రమంలో నిర్లిప్తత వహిస్తే ఊరుకోనని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో డాక్యుమెంట్లు సమకూర్చే బాధ్యత ఎంపీడీవోలదే, సాంకేతిక సహ కారం అందించే బాధ్యత తహశీల్దార్లదేనన్నారు. డేటా ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండకూడదన్నారు.కోరుకొండ మండలంలో రీసర్వే అన్ని గ్రామాలు పూర్తయ్యాయని చూపడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి. మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు.. వెలుగులు

తెలుగు భాష మనది.. నిండుగ వెలుగు భాష మనది.. నిజమే మరి.. తెలుగుకు ఎంతో మంది కవులు వన్నెతెచ్చారు.. తేట తేట తెలుగులా అంటూ కీర్తించారు.. ఆ కవులందరినీ ఒకసారి చూడగలమా.. కాస్త కష్టమే..అందుకే అమలాపురం రూరల్ వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వంద మంది తెలుగు కవుల చిత్రపటాలు మన ముందుకు తెచ్చారు.. తెలుగు కీర్తి చాటారు. - **అమలాపురం రూరల్**

భక్తజన సిద్ధివినాయకుడు



అయినవిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. లక్ష దూర్వార్చన పూజ నిర్వహించారు.మూషిక వాహనంపై స్వామివారికి మాడవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మణికంఠ స్వీట్స్ స్వీట్ల వితరణ, చేమకూర శ్రీను, భద్రం బ్రదర్స్‌చే పులిహోర, భావిశెట్టి రాంబాబు, తాతాజీ బ్రదర్స్ చక్కెరపొంగలి ప్రసాదం వితరణ జరిగాయి. కోనసీమ విద్యాశ్రమం(ముక్తేశ్వరం) విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు.

గణేశుడి ప్రతి.. రూపాయు!

పలు దేశాల నాణేలపై వినాయకుడి ప్రతిరూపాలు

అమలాపురానికి చెందిన కృష్ణ కామేశ్వర్ సేకరణ



ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం



కుక్ ఐలాండ్స్ దేశం ముద్రించిన బంగారుపూత వినాయకుని నాణెం



గింగీ నాయకులు ముద్రించిన గణపతి రాగినాణెం

అందుగలడు.. ఇందులేడని సందేహము వలదు..ఎందెందు వెతికినా గణేశుడే కదా.. గణపతిపూజ మన దేశానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో విఘ్నేశ్వరుడు పూజలు అందుకుంటున్నాడని చెప్పడానికి ఆయా దేశాల కరెన్సీ నోట్లపై ఉన్న గణేశుడి రూపమే నిదర్శనం. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రపంచ వ్యాప్తంగా గణేశుడి ముఖ చిత్రాలతో విడుదల చేసిన కరెన్సీ నోట్లు, నాణేలు సేకరించారు. పూర్వం నాణేలపై కూడా వినాయకుడి రూపాలే ముద్రించారు. ఇండోనేషియా దేశం ముద్రించిన రూ.20 వేల కరెన్సీ నోట్లపై విద్యాగణపతిని ముద్రించారు. 2013లో ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం నేటికీ ప్రత్యేకమే. ఇక 2018లో తువాలు దేశం నృత్యగణపతి ముఖచిత్రంతో ముద్రించిన అల్యూమినియం, బ్రాంజి, వెండి నాణేలు ఆకర్షణీయంగా ఉన్నాయి. 2019లో కుక్ ఐలాండ్స్ దేశం 93.3 గ్రాముల వెండి నాణెంపై బంగారు పూతతో వినాయకుడి నాణేన్ని ముద్రించారు. 2011లో థాయ్‌లాండ్ దేశం వినాయకుని ముఖచిత్రంతో 10 బాట్ల నాణెం విడుదల చేసింది.1509లో విజయనగర సామ్రాజ్యానికి విధేయులై తంజావూరు, మధురై ప్రాంతాలను పాలించిన గింగీ నాయకులు ఒక కాసు రాగినాణెంపై వినాయకుని ముఖ చిత్రంతో ముద్రించారు. ఇలా ఎన్నో దేశాల్లో గణపతి రూపాలతో కరెన్సీ నోట్లు, నాణేలను ముద్రించారు.

- అమలాపురం రూరల్ -ఆంధ్రజ్యోతి



థాయ్‌లాండ్ ముద్రించిన వినాయకుడి నాణెం



ఇండోనేషియా ముద్రించి రూ.20 వేల నోటు





తువాలు దేశం ముద్రించిన నృత్యగణపతి నాణెం

చనిపోయినా.. చూడొచ్చు!



నేత్రదానంతో అంధులకు వెలుగులు

- ఎవరైనా నేత్రదానం చేయవచ్చు
- అంధులకు చూపు ప్రసాదించవచ్చు
- చనిపోయిన 6 గంటల్లోపే కార్నియా తీయాలి
- నేత్రదాన పక్షోత్సవాలు

అంబాజీపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మనం చనిపోతే మనతో పాటు శరీరం అంతా భూమిలో కలిసిపోవాల్సిందేనా..! మన చనిపోయినా బతికే ఉండొచ్చు..! అదెలాగంటే మన అవయవాలను దానం చేయడం ద్వారా.. సర్వేంద్రియానాం..నయనం ప్రధానం అంటారు.. అందుకే పుట్టుకతో అంధత్వం గల వారితో పాటు పలు కారణాలతో మధ్యలో చూపు కోల్పోయిన వారిని సమాజంలో ఎంతో మందిని చూస్తుంటాం. మరణించిన తర్వా త నేత్రదానం చేసి అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. సెప్టెంబరు 8 వరకూ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం...

చిన్న పొరపాటు చాలు..

ఆహారంలో విటమిన్ ఏ, డీ లోపించడం.. పోషకాహార లోపంతో కంటి జబ్బులు వస్తున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. కార్నియా అంటే పలుచటి పారదర్శక పొర. ఇది కంటిలో కనుపాప ముందుంటుంది. ఇన్‌ఫెక్షన్ ద్వారా, దెబ్బతగలడం ద్వారా, పోషకాహార లోపంతో ఈ పారదర్శక పొర దెబ్బతిని చూపు మసకబారుతోంది.తెల్లని పొర ఏర్పడడంతో కంటిచూపు కోల్పోతారు. పుట్టుకతోనే(తల్లిగర్భంలో) ఇన్‌ఫెక్షన్ రావడంతో నల్లగుడ్డు ఏర్ప డే సమయంలో అది తెల్లబడి ఉంటుంది. వైరల్, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, పసరు కంటిలో పోయడంతో కంటి చూపు దెబ్బతింటుంది. కళ్లను గాయాల నుంచి కాపాడుకోవాలి. కత్తెర, కత్తి, సూది, టపాసులు, యాసిడ్‌లు వంటి వస్తువులు పిల్లలకు అందకుండా ఉంచాలి.

40 వేలే కార్నియాల సేకరణ

ప్రతి ఏటా లక్షలాది కళ్ళు అవసరం ఉండగా కేవలం 40 వేల కార్నియాల సేకరణ మాత్రమే సాధ్యపడుతోంది. కార్నియా జబ్బుతో బాధపడి కంటిచూపు కోల్పోయిన వారు దేశంలో లక్షకు పైగా ఉన్నట్టు అధికార గణాంకాలను బట్టి తెలుస్తుంది.వీరికి కార్నియా మార్పిడి చేస్తే మళ్లీ ఈ అందమైన లోకాన్ని చూసే అదృష్టం కలుగుతోంది.ఆ అదృష్టాన్ని వారికి ఎవరైనా ప్రసాదించవచ్చు.చేయాల్సిందల్లా మన చుట్టూ ఉన్న వారిలో ఎవరైనా చనిపోతే వారి నేత్రాలు దానం చేయడానికి కుటుంబీకులను ఒప్పిస్తే సరి.ఏవయసు వారైనా నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానానికి వీరు అర్హులు..

వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు. ప్రమాదవశాత్తు గుండెజబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మరణించిన వారు, సహజ మరణం పొందిన వారు నేత్రదానానికి అర్హులు.మధుమేహం, రక్తపోటు, వ్యాధిగ్రస్తులు మరణానంతరం నేత్రదానం చేయవచ్చు.ఎయిడ్స్, కుక్కకాటుతో మరణించిన వారు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలం కోమాలో ఉన్న వారి నేత్రాలు పనికిరావు. ఇతర ఏ వ్యాధులైనా నేత్రదానం చేయవచ్చు. మరణించిన వ్యక్తి నుంచి మాత్రమే నేత్రాలను సేకరిస్తారు.వీటిని సేకరించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ఐ బ్యాంక్‌లు ఏర్పాటు చేశారు.ఈ నేత్రాలను ఉచి తంగా వైద్యులు, ఐ బ్యాంక్ టెక్నీషియన్ సేకరిస్తారు. ఒక వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలు సేకరిస్తారు. ఐబ్యాంకులకు సమాచారమిస్తే వారు వచ్చి 10 నుంచి 15 నిమిషాల్లో చనిపోయిన వారి నేత్రాలు సేకరిస్తారు.నేత్రదానం వల్ల అంతిమ సంస్కారాలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

బొగ్గుసొరను కాపాడుకుందాం

- తీరప్రాంత మత్స్యకారులకు అటవీశాఖాధికారుల అవగాహన కార్యక్రమాలు



తాళ్లరేవు మండలంలోని తీరప్రాంతంలో బొగ్గుసొర నమూనా

తాళ్లరేవు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో అరుదైన భారీ చేప బొగ్గుసొర ఆవశ్యకతపై అటవీశాఖాధికారులు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. తీరప్రాంత మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో సముద్రంలో వేటచేసే మత్స్యకారులకు ఆరురోజులపాటు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటిమొగ కుంభాభిషేకం ప్రాంతంలో అటవీశాఖాధికారులు శుక్రవారం ప్రపంచ బొగ్గుసొర దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లినప్పుడు సాదు స్వభావంగల బొగ్గుసొరను పట్టడం లేదా వాటికి హాని కలిగించే పనులు చేయడం వంటివి చేయకూడదని సూచించారు. ఇది సముద్రాన్ని శుభ్ర పరుస్తుందని, చేపలవేటకు మత్స్యకారులకు మేలు చేస్తుందని, అందుకని దీన్ని కాపాడేందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారులు సిద్దార్థ, ధనంజయరావు, మహేష్, గోపి, సంధ్యారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి

- 1,584మంది అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల పరిశీలన
- హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం
- వారి కోసం తనిఖీ బృందాలకు తప్పని ఎదురుచూపులు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ ఏడీ రామలింగం, డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెగాడీఎస్సీ-2025 మెరిట్‌లిస్టులో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం అర్ధరాత్రి పూర్తయింది. వివిధ కారణాలతో హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించి వెరిఫికేషన్‌కు రావాలని సూచించి వారి కోసం ఎదురుచూడాల్సి రావడంతో కొంత జాప్యం చోటు చేసుకుంది.

పెరిగిన అభ్యర్థుల సంఖ్య

మెరిట్‌లిస్టులో ఉన్న అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన 25 తనిఖీ బృందాలు రెండురోజులు రాత్రింబవళ్లు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2గంటల వరకూ 1,018 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేయగా శుక్రవారం రాత్రి 8గంటలకు హాజరైఉన్న మరో 566మంది అభ్యర్థుల పరిశీలన పూర్తిచేశారు. కాల్‌లెటర్‌లు జనరేట్ అయిన అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. శుక్రవారానికి ఈ సంఖ్య 1,351మంది నుంచి 1,618మందికి చేరుకుంది. ఎంఈవో, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్ సభ్యులుగా ఉన్న బృందాలు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన, ఫిజికల్‌గా తీసుకువచ్చిన సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు.

ఫోన్‌లో సమాచారం

1618మంది అభ్యర్థులకు 1584మంది అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మిగిలినవారు ఆన్‌లైన్‌లో తమకు కాల్‌లెటర్ జనరేట్ అయిన సమాచారం చూసుకోకపోవడం,ఇతర సాంకేతికపరమైన కారణాలతో హాజరుకాలేనట్లు గుర్తించిన అధికారులు వారికి మరొక అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అలా హాజరుకాని 34మంది అభ్యర్థులకు సంబంధించి తమవద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్‌చేసి తక్షణం పరిశీలనకు హాజరు కావాలని సమాచారం అందించారు. దీంతో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు చెందినవారు అప్పటికప్పుడు బయలుదేరారు. వీరికోసం తనిఖీ బృందాలు అర్ధరాత్రి వరకూ వేచి చూసి తనిఖీ పూర్తి చేశాయి. తమకు తెలియకున్నా విద్యాశాఖాధికారులు ఫోన్‌లో సమాచారం ఇచ్చి తనిఖీకి రమ్మని చెప్పడంతో సదరు అభ్యర్థులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

ఉన్నతాధికారుల పరిశీలన

సర్టిఫికెట్ల పరిశీలన రెండు రోజులు తనిఖీ బృందాలతోపాటు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావులు అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. వీరికి ఉమ్మడి జిల్లాకు చెందిన డీఈవోలు, డీవైఈవోలు సహకారం అందజేశారు.

56 అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన



చెముడలంకలో 56అక్షరాల వాగ్దేవతా చిత్రపటాలతో విద్యార్థులు

ఆలమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడలంక షిర్డిసాయి విద్యానికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా జరిపిన ఈ కార్యక్రమంలో 56 తెలుగు అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి అక్షరానికి ఒక ఆదిదేవత ఉంటుందని, అవన్నీ బీజాక్షరాలని షిర్డిసాయి విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి అన్నారు. 56 చిత్రపటాలకు విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

కాకినాడ ఆర్‌ఎంసీలో జీఎన్‌ఎం నర్సింగ్ పరీక్షల్లో కాపీయింగ్ ఆరోపణలపై విచారణ

జీజీహెచ్ (కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్‌ఎంసీలో నిర్వహిస్తున్న జీఎన్‌ఎం నర్సింగ్ పరీక్షల నేపథ్యంలో జరిగిన కాపీయింగ్ ఆరోపణలపై శుక్రవారం విచారణ జరిగింది. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఏర్పడింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి, నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాసుందరి సభ్యులుగా ఈ కమిటీ నడిచింది. ఇందులో 30మందిని విచారించారు. ఇందులో ఇన్విజిలేటర్లు, జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సహా సీనియర్ అసిస్టెంట్ ఏసుబాబు ఉన్నారు. ఆర్‌ఎంసీ డైనింగ్ హాల్‌లో ఈ విచారణ జరిగింది. కాపీయింగ్ జరిగిందా లేదా జరిగితే కారణాలు ఏంటన్న కోణంలో విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను సీసీ ఫుటేజ్ ఆధారాలతో విచారణ కమిటీ డీఎంఈకి సమర్పించింది.

తెలుగు భాష వ్యాప్తి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్
- ఐడియల్ కళాశాలలో ముగిసిన తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు



రచయిత రవి మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల, ఐడియల్ కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్

కాకినాడరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలల్లో ఐదురోజులపాటు నిర్వహించిన డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగుభాషా సాహిత్య ఉత్సవాలు తెలుగు భాషా దినోత్సవంతో శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో గౌరవఅతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ముఖ్యఅతిథిగా రచయిత రవి మంత్రి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల మాట్లాడుతూ చదువుల్లో భాషకు ప్రాధాన్యం ఉండాలని, తమ తరం విద్యార్థులు మైళ్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవాల్సి ఉండేదని, ఇప్పటి విద్యార్థులకు చదువు కోసం అన్ని సదుపాయాలు ఉన్నాయని అన్నారు. అనంతరం రవి మంత్రి మాట్లాడుతూ కొత్త తరం యువతీ, యువకుల్లో తెలుగుభాష, సాహిత్య అధ్యయన స్పృహ పెంచేందుకు తన రచనల ద్వారా కృషి చేస్తున్నానన్నారు. తెలుగు వారి భాష, భావం వెనకబడలేదని, తన నవల లక్షా50వేల కాపీలు అమ్ముడవడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు అతిథులు ప్రతిభా పత్రాలను, బహుమతులను అందజేశారు. స్థానిక సెయింట్ జేవియర్స్ హైస్కూల్ విద్యార్థులు పాటలు, క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్‌ఎస్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్ అతిథులను, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా పి.పద్మజావాణి, భారత లక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కేఎస్ వాసు, చింతపల్లి సుబ్బారావు, మార్ని జానకి రామ్‌చౌదరి, పి.సుబ్బారావు, కె.దుర్గాప్రసాద్, శిరీష్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఆదేశాలమేరకు దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, గ్రామస్థాయి నుంచి క్రికెట్ క్రీడను అభివృద్ధి చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 12 నుంచి 14 వరకూ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో స్వర్ణాంధ్ర ఇంక్లూసివ్ క్రికెట్ కప్-2025 నిర్వహిస్తున్నట్లు ఏసీఏ దివ్యాంగుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ,టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ చిత్తులూరి వీర్రాజు(రాజా) తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈటోర్నమెంట్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఆతిథ్య జట్టు తూర్పుగోదావరి జట్లు పాల్గొంటాయన్నారు. పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఎంపిక 31న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు మాత్రమే తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున పోటీలో పాల్గొంటారని కన్వీనర్ చిత్తులూరి రాజా తెలిపారు. వివరాలకు 8498877877, 9440121865 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన


బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట కెనరా బ్యాంకుకు చెందిన గోల్డ్ అప్రోచర్ రామోజుల రాజశేఖర్ జైలుకెళ్లి బయటకు వచ్చినప్పటికీ తమ బంగారం తమకు ముట్ట లేదని, బ్యాంక్ అధికారులు, గోల్డ్ అప్రోచర్ ఉద్దేశపూర్వకంగానే తమను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తూ శుక్రవారం తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తమ బంగారం ఇచ్చే వరకు కదిలేది లేదంటూ ఆందోళన చేపట్టి బ్యాంక్ అధికారులను నిలదీశారు. గ్రామ సర్పంచ్ అత్తి నాగబాబు ఖాతాదారులకు మద్దతుగా నిలిచి బంగారు ఆభరణాలు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- పి.గన్నవరంలో ఏడుగురిపై దాడి

పి.గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పీ.గన్నవరం పెట్రోలు బంకు సమీపంలో వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురిపై కొన్నిగంటల వ్యవధిలో దాడికి పాల్పడింది. గాయపడిన వారిలో జల్లి పుష్పవతి (వై.కొత్తపల్లి), యర్రంశెట్టి సత్యశ్రీరామ్ (పి.గన్నవరం), తోరం సత్యసాయి (వైపీ పాలెం), సీహెచ్ నాగరాజు (పి.గన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీ), చుట్టుగుళ్ల శ్రీనివాస్ (పి.గన్నవరం), సీహెచ్ నరసింహం (పి.గన్నవరం)ఉన్నారు. వీరికి పీ.గన్నవరం సీహెచ్‌సీలో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందించి ప్రథమ చికిత్స చేశారు. వారిలో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో కొన్ని గంటలపాటు పరిశీలనలో ఉంచినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కాగా, పీ.గన్నవరం, తదితర పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సత్యదేవుడికి హెలీకాప్టర్ ఫ్యాన్లు అందజేత


వార్షిక కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

అన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని సత్యదేవుడి వార్షిక కల్యాణమండపం వద్ద భక్తులు సేద తీరేందుకు హెలీకాప్టర్ ఫ్యాన్లను శుక్రవారం అమర్చారు. వీటిని లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ విరాళంగా సమకూర్చారు. వీటివిలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. అలాగే ప్రసాదం కౌంటర్‌లోని షెడ్డు వద్ద మరో ఫ్యాన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

చెట్టుకు ఉరి వేసుకుని యువకుడి మృతి


చెట్టుకు వేళాడుతున్న సైదుఏసు మృతదేహం

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ పరిధి తిరుగుడుమెట్టలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలివి.. తిరుగుడుమెట్టకి చెందిన సైదుఏసు (26) గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈయనకు ఆరు సంవత్సరాల క్రితం వివాహ మయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం భార్య మృతి చెందింది. దీంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆయన తల్లి పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టీ. రామకృష్ణ తెలిపారు.

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



కాకినాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ, తదితరులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగేలా రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. కాకినాడ జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసీడీఎస్ విభాగం మహిళాల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మహిళా కమిషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులు ఒక్కరిదే బాధ్యత కాదని, సమాజంలో ప్రతిఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని వనరులు కల్పించినా, పోలీస్ విభాగం ద్వారా శక్తి యాప్, శక్తి టీమ్స్, మహిళా పోలీస్‌స్టేషన్ వంటి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా మహిళలపై అక్కడక్కడా లైగింక వేధింపులు, దాడులు ఇంకా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. అవగాహనలోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, మహిళాశిశు సంక్షేమశాఖ ద్వారా ప్రతిచోటా, వేసవి సెలవుల్లో కూడా కిశోర వికాశం వంటి కార్యక్రమాల ద్వారా గుడ్ టచ్, బాడ్ టచ్, పోక్సో తదితర చట్టాల గురించి బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా కమిషన్ ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా చేపడుతున్నామన్నారు. మహిళల రక్షణ దిశగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఇటీవల వెలువడిన జాతీయస్థాయి సర్వేలో వైజాగ్ నగరం దేశంలో బాలికలకు అత్యంత భద్రమైన నగరాల్లో ఒకటిగా పేర్కొనడం మనందరం ఆనందించే అంశమని తెలిపారు. కేవలం వైజాగ్ నగరమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి ఊరిని ఆడ పిల్లలకు భద్రమైనదిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మహిళా కమిషన్ పనిచేస్తోందని, ఇందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీవో సంస్థలు మంచి విద్య, మార్కుల సాధనతో పాటు సమాజంలో భద్రంగా ఎలా ఉండాలనే అంశంపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలని, మగపిల్లలు సైతం బాలికలు, మహిళలపట్ల మర్యాదగా వ్యవహరించేలా నైతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఆడబిడ్డలు, మహిళలపై అకృత్యాలు జరిగినప్పుడు, వాటిపై ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రావాలని, రిపోర్టింగ్ పెరిగి నేరస్తులకు శిక్షలు పడితే, నేర ప్రవృత్తి కలిగిన వారికి వణుకు పుట్టించే గట్టి హెచ్చరికలుగా నిలుస్తాయని, లింగపరమైన నేరాలు తగ్గుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంవల్ల ఎక్కువమంది మహిళలు బయటికి వచ్చి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, తద్వారా మహిళా సాధికారత మరింత పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, ప్రోత్సాహలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

- అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం
- 172 మంది క్రీడాకారులు హాజరు



పోటీల్లో పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు



అమలాపురం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో శుక్రవారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా .. ఉత్కంఠ భరితంగా జరిగాయి. అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 172 మంది పవర్ లిఫ్టర్లు హాజరయ్యారు. పోటీలను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ, పురుష విభాగాల్లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, డీఎస్‌డీవో పీఎస్ సురేష్ కుమార్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ హాజరై పలు విభాగాల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, కల్వకొలను బాబు, రవణం వేణుగోపాల్, ముమ్మిడి ప్రతాప్‌కుమార్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో విజేతలు..

ఈ పోటీల విజేతలను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి వెల్లడించారు. 53 కిలోల పురుషుల విభాగంలో పి.వీరేంద్ర (కాకినాడ) ప్రథమ, పి.సూర్యదినేష్ (పి.గన్నవరం) ద్వితీయ, సీహెచ్ సత్యగోపి (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల సీనియర్స్ విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం) ప్రథమ, వై.వీరబాబు (పి.గన్నవరం) ద్వితీయ, వి.రవికుమార్ (మురమళ్ల) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోల విభాగంలో జి.సాయిమణికంఠ (కాకినాడ), కె.నాని (అమలాపురం), జి.ఫణిమధు (రాజమహేంద్రవరం) వరుస స్థానాల్లో నిలిచారు. 66 కిలోల మహిళల విభాగంలో పి.స్పందన (రాజోలు) ప్రథమ, యు.షానిక (రాజోలు) ద్వితీయ, టి.కీర్తి (రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. 66కిలోల పైబడిన విభాగంలో పి.దీవెన (కాకినాడ) ప్రథమ, వై.ఇందిర(అమలాపురం) ద్వితీయ, కె.మంజుల(రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. రాత్రి వరకు పోటీలు కొనసాగుతున్నాయి.

బాలుర విభాగంలో ...

ఉద్ధృతంగా గోదావరి

- కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల
- నిలకడగా నీటి మట్టం


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ధవళేశ్వరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపనదుల నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తి వేసి (ఆల్ క్లియర్ పొజిషన్)ఎగువ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10 అడుగులుగా నమోదై నిలకడగా కొనసాగుతోంది. ఇదే సమయంలో ఎగువన భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటి మట్టం శుక్రవారం రాత్రి 7గంటలకు 42.90 అడుగులకు చేరుంది. మరో పాయింట్ పెరిగి నీటి మట్టం 43 అడుగులకు చేరితే భద్రాచలం వద్ద మొదటిప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.


నీట మునిగిన చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారి

తగ్గుతూ..పెరుగుతూ..


చింతూరు-ఒడిస్సా హైవేపై వెళ్తున్న వాహనాలు

చింతూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద రోజుల తర బడి పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. చింతూరు వద్ద శబరి నది 32 అడుగులుగా ఉండగా సాయంత్రం 7 గంటలకు 30 అడుగులకు తగ్గింది. కాగా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో ఆ ప్రభావం శనివారం ఉదయానికి శబరి నదిపై పడనుంది. దీంతో తిరిగి శబరి పెరిగే పరిస్థితి కానవస్తోంది. గోదావరి ఎగపోటే దీనికి కారణంగా ఉంది. ఇదిలా ఉండగా చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై వరద నీరు తగ్గడంతో అటుగా రాకపోకలు మొదలయ్యాయి. అయితే సోకిలేరు వాగుపై వరద తగ్గకపోవడంతో చింతూరు- వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. శనివారం శబరి నదికి వరద ఉధృతి పెరిగే పరిస్థితి ఉన్నందున లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ సూచించారు. చింతూరు డివిజన్‌లో తొమ్మిది ప్రదేశాల్లో ప్రధాన రహదారులు ముంపునకు గురయ్యాయి. దీంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు నాటు పడవలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్టు పీవో పేర్కొన్నారు. రోజుల తరబడి వరద తగ్గకపోవడంతో లోతట్టు వాసులు నిత్యావసర వస్తువుల కోసం అవస్థలు పడుతున్నారు. కాగా వరద తగ్గడం, పెరుగుతుండడంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అంతర్జాతీయ సమావేశాలకు ఐసీఏఆర్ డైరెక్టర్


శేషుమాధవ్‌ను అభినందిస్తున్న ఐసీఏఆర్, శాస్త్రవేత్తలు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్, 29(ఆంధ్రజ్యోతి): పొగాకు, పొగాకు ఉత్పత్తులకు సంబంధించి స్టాక్ హోం స్వీడన్‌లో సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలకు రాజమహేంద్రవరం ఐసీఏఆర్ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ పాల్గొననున్నారు.భారతదేశం ఐఎస్‌వో-టీసీ-126లో సభ్య దేశంగా ఉన్నందున భారత ప్రతినిధిగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సమావేశాల్లో పొగాకు ఉత్పత్తుల పరీక్షలకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాల సమీక్షలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శేషుమాధవ్‌కు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొట్లాట కేసులో నిందితుడికి ఏడాది జైలు

కె.గంగవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసులో వ్యక్తిని గాయపరిచిన నిందితుడికి జైలు శిక్ష పడిందని పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం జూన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుదుపూరు గ్రామంలో పోలిశెట్టి వెంకటరమణ తన కుమారుడు మనోహర్‌తో తన ఎదురింటిలో ఉంటున్న కనకాల వీరబాబు వద్దకు వెళ్లి ఒక బండి విషయమై గొడవ పడ్డారు. వెంకటరమణను వీరబాబు దాడిచేసి గాయపరిచాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రామచంద్రపురం కోర్టులో వాదోపవాదాల అనంతరం వీరబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. ఏపీపీ రామతులసి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన ఎస్ఐ జానీ బాషా, సిబ్బంది బృందాన్ని డీఎస్పీ బి.రఘువీర్, సీఐ వెంకటనారాయణ అభినందించారు.

గేదెలను మేపడానికి వెళ్లి విగతజీవిగా మారాడు

- సుద్దగడ్డ కాలువలో వ్యక్తి మృతదేహం

గొల్లప్రోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గేదెలు మేపడానికి వెళ్లి కనబడకుండా పోయిన వ్యక్తి విగతజీవిగా మారిన సంఘటన గొల్లప్రోలులో జరిగింది. పట్టణంలోని కరణం గారి వీధికి చెందిన దాట్ల నాగబాబు(48) ఎనిమిదేళ్లుగా వెల్లంకుల నాగశ్రీను వద్ద గేదెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 17న గేదెలు మేపేందుకు వెళ్లి తిరిగి రాలేదు. గేదెలు మాత్రం తిరిగి వచ్చాయి. దీనితో అతడి కోసం ఎక్కడా వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం పట్టణ శివారు తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ కాలువలో అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కాలువలోని తుమ్మచెట్టుకు తగులుకుని మృతదేహం ఉండిపోయింది. ప్రమాదవశాత్తు పడి మరణించాడా, ఇతర కారణాలు ఉన్నాయా అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి భార్య 20 సంవత్సరాల క్రితమే అతడి నుంచి వేరుగా వెళ్లిపోయింది. అతడికి సంబంధీకులు ఎవరు లేరని పోలీసులు తెలిపారు.

నిండుకుండలా..



మోతుగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీలేరు నది పరివాహక ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. డొంకరాయి జలాశయం 1037 అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి 1031.0అడుగులకు చేరుకుంది. వర్షాలు ఇలాగే కురిస్తే త్వరలోనే గరిష్ఠ నీటి మట్టానికి చేరుకుంటుందని జెన్‌కో ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతుండడంతో ముందు విద్యుదుత్పత్తికి ఎటువంటి ఆటంకాలు ఉండవని అధికారులు పేర్కొన్నారు.

స్కూల్ భవనంపై చర్చి నిర్వహణ సరికాదు

- కోరుమిల్లిలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

కపిలేశ్వరపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో ప్రైవేటు పాఠశాల భవనంపై చర్చి నిర్వహిస్తున్నారంటూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రైవేటు పాఠశాల వద్ద ప్రార్థనలు నిర్వహించడం సరికాదని కొంతకాలంగా అడుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్,ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. చర్చికి నిర్వహణకు అనుమతులు లేకపోయినా సర్పంచ్, కార్యదర్శి చర్యలు తీసుకోలేదని ఆందోళనకారులు అన్నారు. కాగా చర్చి నిర్వాహకులు వచ్చే నెల 6 నాటికి అనుమతి పత్రాలు సమర్పించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి కామేశ్వరరావు నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ గవరయ్య, విజయ్, ఉమ్మడి జిల్లా హైందవ పరిరక్షణ మహిళా అధ్యక్షురాలు కె.తులసి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ శివారు వీధివారి లంకకు చెందిన పల్లి చిట్టియ్య(65) మృతదేహం శుక్రవారం లభ్యమైంది.గురువారం చిట్టియ్య తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గోదావరిలో పడి గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో ఎస్‌డీఆర్ఎఫ్ బృందంతో రెవెన్యూ, పోలీసులు గాలించారు.దీం తో చిట్టియ్య మృతదేహాన్ని తొగరపాయ నదిలో గుర్తించి వెలికితీసారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని, ఈ మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బంగారు గొలుసు.. బాధితుడికి అందజేత

అలమూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల గ్రామానికి చెందిన కుమ్మరపురుగు ఆదినారాయణ జొన్నాడ నుంచి ఆలమూరు వైపు వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో 2కాసుల బంగారు గొలుసు పడిపోయింది. దీనిపై ఆయ న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అటుగా వస్తున్న ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, చింతలూరు సొసైటీ అధ్యక్షుడు నల్లా వెంకన్నలకు ఆ గొలుసు దొరకగా దానిని ఆలమూరు పోలీసులకు అందించారు.దీంతో ఆదినారాయణను పిలిపించి లక్ష్మణరావు, వెంకన్నల సమక్షంలో గొలుసును ఎస్ఐ జి.నరేష్, ఏఎస్ఐ సూర్యచంద్రరావు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకన్నలకు ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.38,20,531



మామిడికుదురు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ హుండీల ఆదాయం రూ.38,20,531 వచ్చిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 71 రోజులకు హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించగా పై ఆదాయంతో పాటు 30.200 గ్రాముల బంగారం, 105.00 గ్రాముల వెండి, యూఎస్ డాలర్ నాలుగు, సౌదీ అరేబియా రియల్స్ 10, యూఏఈ దిర్హమ్స్ 5, ఒమన్ రియల్స్ 5, కువైట్ దినార్స్ 23, ఇరాక్ దినార్స్ 5 వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్ ఎంకేటీవీ ప్రసాద్, బాలబాలాజీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యవంతమైన సేవలందించేందుకు కృషి

అనపర్తిలో స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే నల్లమిల్లి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యవంతమైన సేవలందించేందుకు ప్రతి అంశంలోను సాంకేతికతను మేళవించి సుపరిపాలన అందించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని రజక కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. అలాగే నాలుగు మండలాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.10.81 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం పబ్లిసిటీకి తావు లేకుండా విద్య, రెవెన్యూ రంగాల్లో సేవలందిస్తోందన్నారు కార్యక్రమంలో నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, ఎంపీపీ సుమ, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

భూయజమానులకు న్యాయం జరిగేలా చూస్తా

ఆర్డీవో కృష్ణనాయక్



దివాన్‌చెరువులో భూసేకరణ వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

దివాన్‌చెరువు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువుకు మంజూరైన ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ విషయంలో యజమానులకు నష్టం జరగకుండా న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ భూసేకరణ విషయమై కొందరు యజమానుల నుంచి అభ్యంతరాలు రావడంతో శుక్రవారం ఇక్కడకు వచ్చి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భూయజమానులు మాట్లాడుతూ 2018లో ఒకసారి సర్వే చేశారని ఆ అవార్డు కాపీలో పేర్కొన్న భూమి కంటే ఎక్కువ భూమిని ప్రస్తుతం అధికారులు తీసుకుంటున్నారని వాపోయారు. తమ వద్ద సేకరించిన భూమి మేరకే తమకు పరిహారం చెల్లించారని తెలిపారు. అయితే ఈ విషయమై ఆందోళన చెందవద్దని సంబంధిత అధికారులతో మరోసారి చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పేర్కొన్నారు.

చంబల్ లోయ దొంగల్లా వేటాడుతున్నారు

వైసీపీ నేత భూమన కరుణాకర రెడ్డి

రాజమహేంద్రవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సంవత్సరం మూడు నెలలుగా ఈ రాష్ట్రంలో పోలీసులు శాంతి భద్రతలు కాపాడడం అనే లక్ష్యాన్ని పూర్తిగా మరిచిపోయి వైసీపీ నాయకులను, కార్యకర్తలను చంబల్‌లోయ దొంగల్లా వెంటాడడం, వేటాడడమే సరిపోతోందని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం కరుణాకర్ మాట్లాడుతూ చంద్రబాబు, ఆయన పార్టీపై అసమ్మతి వ్యక్తీకరించినా ఏదొక రకంగా తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో పెట్టడం రివాజుగా మారిపోయిందని ఆరోపించారు. నిర్బంధిస్తే జైళ్లలోకి ఆనందంగా వెళతామన్నారు. తప్పుడు కేసులు పెడితే జేజేలు పలుకుతూ, జగన్ నినాదాలు చేస్తూ మళ్లీ ఆయన నాయకత్వంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. మిథున్ జైలులో చాలా ధైర్యంగా ఉన్నారన్నారు. తమను 90 రోజులు లేదా 200 రోజులు జైళ్లలో పెట్టినా మనోనిబ్బరాన్ని తగ్గించలేరన్నారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు మాట్లాడుతూ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా మిథున్‌ని అరెస్టు చేసిందన్నారు. వైసీపీ పార్టీ వాళ్లను ఈ కూటమి ప్రభుత్వం టార్గెట్ పెట్టి హింసిస్తోందని విమర్శించారు.

21 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 21 నుంచి 28వ తేదీ వరకూ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సిటీ బ్యాడ్మింటన్ కోర్టులు, బొప్పన స్పోర్ట్సు క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్సు హబ్‌గా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీకి అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌గా పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మద్దూరి శంకర్, బెజవాడ వెంకట్, చిట్టూరి రాంబాబు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

తైవాన్‌లో ఉద్యోగావకాశాలు మెండు

» న్యూఢిల్లీ టీఈసీసీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌జి యాంగ్ » జీజీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆసక్తి ఉన్న విద్యార్థులకు తైవాన్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని న్యూఢిల్లీ టీఈసీసీ (తైవాన్)సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌జీ యాంగ్ పేర్కొన్నారు. జీజీయూలో హరిత ఆర్థిక వ్యవస్థ-స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీఎస్) కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో యాంగ్ మాట్లాడుతూ సెమీ కండక్టర్ల సాంకేతికతలో జీజీయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ఆసక్తి ఉంటే ఉద్యోగవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. తైవాన్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. వీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇండో-తైవాన్ ప్రాజెక్టులపై విద్యార్థులు పనిచేసేందుకు జీజీయూ నుంచి తైవాన్‌కు పంపించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీజీయూ ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు అరుణ పదవీ విరమణ సభ



చంద్రేడులో అరుణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రంగంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రేడు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గరిమెళ్ల అరుణ పదవీ విరమణ సత్కారసభ శుక్రవారం జరిగింది. దీనికి ఎంఈవో కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి 28 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన అరుణ సేవలను కొనియాడారు. అనంతరం అరుణ, సూర్యనారాయణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు ఎంఈవో ఎమ్మెస్సార్‌మూర్తి, పూర్వ హెచ్ఎం ఎ.ఫణికుమార్, విద్యా కమిటీ చైర్మన్ అండిబోయిన అబ్బాయి, హెచ్ఎంలు పంపన శ్రీనివాస్, వి.పార్థసారథి, గంటా రమణబాబు పాల్గొన్నారు.

ఆదాయం లేక అభివృద్ధి కుంటుపడింది

కోరుకొండ పంచాయతీ పాలక వర్గం

కోరుకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆదాయం లేక కోరుకొండ పంచాయతీని అభివృద్ధి చేయలేకపోతున్నామని, గ్రామంలో సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, వార్డు సభ్యులు వడగళ్లపాటి శ్రీనివాస్, కర్రి వీరగణేష్, బక్కా దుర్గా నరసింహమూర్తి, కొల్లు ధనంజయ, మంతెన నరసింహమూర్తి, రాయబట్టు కృష్ణవేణి, కాలచర్ల శ్రీనివాస్, నీరుకొండ సత్యవేణి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది సక్రమంగా పన్నులు వసూలు చేయకపోవడం వల్ల పంచాయతీకి రావాల్సిన సుమారు రూ.30 లక్షల ఆదాయం రాలేదన్నారు. ఇంటి పన్ను సుమారు రూ.25 లక్షలు, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు రూ.6 లక్షల వరకు బకాయి ఉందన్నారు. బకాయి ఉన్న వారిపై పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పంచాయతీ పరిధిలో ఏటీఎం, టవర్, హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారే తప్ప వాటి నుంచి ఎంత ఆదాయం వస్తుందో తెలియడం లేదన్నారు.

అన్నదాతలకు సత్కారం

బిక్కవోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాల్లో భాగంగా బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం గ్రామానికి చెందిన పిల్లా గంగరాజు సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. 5వేల మంది పాల్గొన్నారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. అనంతరం దాతలను సత్కరించారు.

తెలుగు భాష..అమ్మ భాష

» అందరం పరిరక్షించుకోవాలి
» నన్నయ యూనివర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ
» ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు
» విద్యార్థులకు పోటీలు..బహుమతులు



నన్నయ వర్శిటీలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి) :అమ్మభాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీలో శుక్రవారం తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు వీసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి భాషపై పట్టుసాధించాలని, తెలుగు భాష పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు చివరి కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ లక్ష్యం వైపు వెళ్తున్న వారికి ఇబ్బందులు ఎదురవుతాయని వాటిని ధైర్యంగా అధిగమించాలని సూచించారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియాసాధనాలు, కొత్తపోకడలు భాషలోని ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడలలో రాణించాలన్నారు. తెలుగు అధ్యాపకుడు తలారి వాసు తెలుగు భాష నేపథ్యాన్ని, గిడుగు రామ్మూర్తి కృషిని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు. నామవరంలోని భారతీయ విద్య భవన్స్‌లో తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భువన విజయం లఘునాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యన్, అకడమిక్ కోఆర్డినేటర్ హనుమంతరావు, తెలుగు, వ్యాయామోపాధ్యాయులు శరత్‌చంద్ర, తాతాజీ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వారం రోజులుగా పాఠశాలలో వివిధ క్రీడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ముందుగా ధ్యాన్‌చంద్, తెలుగు భాష వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిర్ల శ్రీనివాస రెడ్డి, పీడీ యువరాజా రెడ్డి, పీజీటీ సాల సూరిబాబు, పంపన వరలక్ష్మీ, కర్రి వీర్రెడ్డిలను గొల్లల మామిడాడ లయన్స్ క్లబ్ వారు సత్కరించారు. కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. సర్పంచ్ సత్తి వీరమణి, సొసైటి, నీటి సంఘ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మెళ్లూరు, బిక్కవోలు ఉన్నత పాఠశాలల్లో తెలుగుభాష, కీడ్రా దినోత్సవాలను హెచ్ఎం జి.లక్ష్మి, రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. కాపవరం ఉన్నత పాఠశాలలో భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం జరిగింది. అమ్మలాంటి తెలుగుభాషని నిర్లక్ష్యం చేస్తే అమ్మను అవమానించినట్లేనని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దార్ల సంఘం అనపర్తి అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. తెలుగు ఉపాధ్యాయిని డి.లోవకుమారిని సత్కరించారు. వేమన, సుమతి శతకాలు వంటి పద్యాలు, కవితలు, వక్తృత్వం, తెలుగు ప్రాముఖ్యతను తెలిపే నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. హెచ్ఎం గోపాలకృష్ణ, వైబీఎస్ ఆచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. గ్రాంధికంలో ఉన్న తెలుగు భాషను వాడుక భాషలోకి తీసుకురాడంలో గిడుగు చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట హైస్కూల్ తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు నిర్వహించారు.గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి, కవిత్రి మొల్ల, నన్నయ, తిక్కన్న, ఎర్రన్నల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే జీజీయూలో ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు విచ్చేసి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు క్రీడాకారులుగా రాణించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జీజీయూ ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, వివిధ కళాశాలల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడం కోసం శుద్ధ గ్రాంధిక వాదులైన జయంతి రామయ్య పంతులు, దీపాల పిచ్చయ్యశాస్త్రి వంటి ఉద్దండులతో పోరాడి వ్యవహారిక భాషోద్యమాన్ని నడిపిన పితామహుడు రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. అనంతరం వసు చరిత్ర సాహిత్య సమాలోచన అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా సెమినార్ నిర్వహించారు. అలాగే ధ్యాన్‌చంద్ భారతీయ క్రీడారంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. శారీరక విద్యావిభాగం నిర్వహించిన ఇంట్రా కాలేజియేట్ క్రీడా కార్యక్రమాల్లో రాణించిన సిబ్బంది, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపార్టుమెంట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్, పీఆర్వో జె.సురేష్, ఫిజికల్ డైరెక్టర్లు పీవీవీ లక్ష్మి, టీ.విజయదుర్గ పాల్గొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో సైకాలజిస్ట్ సుంకర నాగేంద్రకిషోర్, తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం గెలుపు ఓటమితో ముడిపడి ఉంటుందని, జీవితాన్ని గెలిచిన వారే విజేతలు అవుతారన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళాగౌతమి ఆధ్వర్యంలో తెలుగు మాటల పండుగ చివరిరోజు కార్యక్రమంలో భాగంగా సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులతో తాడితోట జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. తెలుగు వెలగాలి, తెలుగు భాష ముద్దు పరభాష వద్దు అంటూ నినాదాలు చేశారు. సంహిత కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, తెలుగువిభాగాధిపతి పీవీబీ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, సీరా గంగాధర్, కేలం శ్రీనివాసరావు, ఎస్.అనిల్‌కుమార్, శరత్‌బాబు, వై.స్వర్ణశ్రీ,పీపీ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఇన్నీసుపేటలోని శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ అత్యున్నత విద్యాధ్యయన సంస్థలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రధానాచార్యులు బ్రహ్మాచారి మాట్లాడుతూ క్రీడలు శారీరక వికాసానికి దోహదం చేస్తాయని, ప్రతిఒక్కరు క్రీడల పట్ల దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ కెప్టెన్ మురళీని ప్రత్యేకంగా సన్మానించారు.



రంగంపేట హైస్కూల్లో వివిధ వేషధారణలలో విద్యార్థులు

గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి

వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా మార్కెట్ కమిటీ కృషి చేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ మార్ని వాసు అధ్యక్షత నిర్వహించిన మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డులో దళారీ వ్యవస్థ రాజ్యమేలిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రకృతి వ్యవసాయం, బీమా వంటివి కల్పించడానికి కృషి చేస్తున్నామని, మోడల్ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దుతామని అన్నారు. చైర్మన్ వాసు మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో ధవళేశ్వరం, వడ్డెరపేటల్లో రైతు బజార్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ సమావేశంలో 333.70 లక్షలతో 50 కొత్త షాపులు, టాయిలెట్లు, పార్కింగ్ షెడ్లు, ఆఫీస్ మరమ్మతులు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నిధులు మంజూరుకు మార్కెటింగ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, రైతు నాయకులు మార్గాని సత్యనారాయణ, సెక్రటరీ వినుకొండ ఆంజనేయులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో బాధితులకు అధిక మొత్తంలో పరిహారం అందజేసే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మీ సూచించారు. ఈ మేరకు విద్యుత్, టెలిఫోన్, బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులతో ఆమె శుక్రవారం సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. రాజీకి అర్హమైన అన్ని కేసులను పరిష్కరించే దిశగా చర్చించారు. .

సత్యదేవా నర్సరీని సందర్శించిన పోలవరం జేసీ

కడియం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఎక్స్ అఫీషియల్ జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ శుక్రవారం కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి స్వాగతించారు. పలు రకాల స్వదేశీ, విదేశీ మొక్కలను జేసి పరిశీలించి వాటి విశిష్టతను, ప్రత్యేకతలను అడిగారు. మొక్కల అందాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్ తదితరులున్నారు.

దేవాన్ష్ ఘాట్‌లోనే నిమజ్జనం చేయాలి


సీతానగరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో వినాయక నిమజ్జనాలు మునికూడలి గ్రామంలోని దేవాన్ష్ ఘాట్‌లో మాత్రమే చేయాలని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సదరు ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున నిమజ్జనానికి అనుకూలంగా మునికూడలి గ్రామంలోని దేవాన్ష్ ఘాట్ ఉందని గుర్తించి దానిని ఎంపిక చేశామన్నారు. గణపతి నవరాత్రుల అనంతరం విగ్రహాలను మునికూడలిలోనే నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన సమయానికి గోదావరి వరద తగ్గితే మరిన్ని ఘాట్‌లు పరిశీలిస్తామని తహశీల్దార్ చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

అనపర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై ప్రచారం చేయాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న అన్నారు. శుక్రవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం కర్రి కళ్యాణి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులతోపాటు పురోహితులు, బంధువులపై కేసులు నమోదవుతాయన్నారు. బాల్య వివాహం చేసుకున్న, చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ళ జైలు, రూ.1 లక్ష జరిమానా విధించే వీలుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమణమూర్తి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

31న ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధునాతన వైద్యం, మందుల వాడకం తదితర అంశాలపై ఈనెల 31న దివాన్‌చెరువులోని ఎస్‌వీపీసీ కన్వెన్షన్‌లో ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు ప్రముఖ వైద్యులు డాక్టర్ మిథున్ చక్రవర్తి, డాక్టర్ శేఖర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి షుగర్, థైరాయిడ్, హార్మోన్స్‌కు సంబంధించిన వైద్యులతో పాటు ఎండీ జనరల్ మెడిసిన్, పీజీ వైద్య విద్యార్థులు ఈ సదస్సుకు హాజరవుతారని అన్నారు.



రోగుల నుంచి అదనంగా వసూలు చేస్తే చర్యలు

నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నెట్ వర్క్ ఆసుపత్రులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులతో శుక్రవారం జిల్లాస్థాయి డిసిప్లీనరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ ద్వారా రోగుల నుంచి సేకరించిన ప్రజాభిప్రాయ నివేదికలను సమీక్షించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో లబ్ధిదారులు అందరికీ పారదర్శకంగా ప్రయోజనం అందాలన్నారు. ఈ పథకం కింద రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు, చికిత్స అందించడంతో పాటు ఎంప్లాయీ హెల్త్ స్కీం, జర్నలిస్టు హెల్త్ స్కీం కింద ఉద్యోగులు, జర్నలిస్టులకు ఉచిత వైద్యం తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేశారు. అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి చెల్లించాలని ఆదేశించారు. ప్రి ఆథరైజేషన్ అభ్యర్థనలు అనవసరంగా అధికంగా ఎందుకు నమోదవుతున్నాయో కారణాలు తెలపాలని ఆసుపత్రులు ప్రతినిధులను ప్రశ్నించారు. డెంటల్ ఆసుపత్రులు ప్రీమియం ఇంప్లాంట్స్ పేరుతో అదనపు వసూళ్లు చేయకుండా పథకం ప్రకారం సేవలు ఉచితంగా అందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ, ఎన్టీఆర్ వైద్యసేవల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



థాంక్యూ సీఎం సార్!


రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : థాంక్యూ సీఎం సార్ అంటూ మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్త్రీ శక్తి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి శుక్రవారం సాయంత్రం పాలాభిషేకం చేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల జీవితాల్లో వెలుగులు నింపిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ తదితరులు పాల్గొన్నారు

ఓ బొజ్జ గణపయ్య!

జిల్లాలో ఎక్కడికక్కడ భారీ గణనాథుల విగ్రహాలు వెలిశాయి.. చాలాచోట్ల పోటాపోటీగా విగ్రహాలు ఏర్పాటు చేశారు.. జిల్లా వ్యాప్తంగా 5 వేల విగ్రహాలు ఏర్పాటు చేయగా.. ఒకదానిని పోలి మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో.. విగ్రహాల తయారీదారులు రకరకాల ఆకరణల్లో వినాయకుడి విగ్రహాలను తయారుచేసి విక్రయించారు.. దీంతో భక్తజనం ప్రత్యేకంగా రూపొందించిన విగ్రహాలను చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.. భారీ విగ్రహాల వద్ద జనం క్యూకడుతున్నారు.. ఈ చిత్రంలో చూస్తున్న విగ్రహం గోకవరంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 అడుగులు ఉంది. భారీకాయుడి ఆకారాన్ని పోలి ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది.ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. - **గోకవరం**



పాస్.. కాలేదు!



తప్పుల తడకగా పాస్ పుస్తకాలు

(కాకినాడ/సామర్లకోట,ఆంధ్రజ్యోతి)

పట్టాదారు పాసుబుక్‌లకు ఎదురుచూస్తున్న రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. గత వైసీపీ హయాం నుంచీ వీటి కోసం అన్నదాతలు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగని రోజు లేదు.ప్రభుత్వం మారాక ఎట్టకేలకు కొత్త పుస్తకాలు ముద్రణ పూర్తయి జిల్లాకు చేరుకున్నాయి. రేపో మాపో పుస్తకం చేతికి వస్తుందనుకున్న తరుణంలో వాటిలో చోటుచేసుకున్న భారీ తప్పులు అధికారులు, కొన్నిచోట్ల రైతులు గుర్తించారు. దీంతో అధికారులు వెనక్కు పంపేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరి చేసి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చేరుకున్న 3.44 లక్షల పాస్‌బుక్‌ల పంపిణీ నిలిపివేశారు.

40 వేల పుస్తకాలు వెనక్కు..

కాకినాడ జిల్లాలో 6,900 పుస్తకాలు తప్పుల తడకగా మారాయి. ఉమ్మడి జిల్లా అంతా కలిపి 40 వేల వరకు పుస్తకాలు ఎందుకు పనికిరాకుండా మారాయి. ఇప్పటికే లాంఛనంగా పంపిణీ చేసిన చోట తప్పులు చూసి అన్నదాతలు లబోదిబోమనడంతో అవన్నీ వెనక్కు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసింది. తప్పులు దొర్లిన పాసు పుస్తకాలన్నింటినీ తాజాగా అమరావతికి వెనక్కు పంపేసింది. ఏ రైతు పుస్తకానికి సంబంధించి తప్పులున్నాయో వాటిని ఆన్‌లైన్ యాప్ ద్వారా సరిదిద్దుతున్నారు.ఈ వివరాల ఆధారంగా మళ్లీ కొత్త పుస్తకాలు రానున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న పాసు పుస్తకాల పంపిణీ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. త్వరలో ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ చేయించాలని భావిస్తోంది.

వైసీపీలో ఇబ్బందే..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అస్తవ్యస్తంగా మారింది. రైతులు భూములు కొనుగోలు చేసి ఏళ్ల దాటినా కనీసం పాస్ బుక్‌లు ఇవ్వలేదు. వాస్తవానికి పాస్‌బుక్‌లు ఉంటేనే భూముల క్రయవిక్రయాలు, రైతులకు రుణాలు వస్తాయి. కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. రైతులు పాస్‌పుస్తకాలకు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూసర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ క్రయవిక్రయ లావాదేవీలు జరిగాయి. 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి.ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. వందేళ్ల తర్వాత గత వైసీపీ ప్రభుత్వం సర్వేశాఖ ద్వారా సమగ్ర భూసర్వే చేయడానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేపై విపరీతమైన ఒత్తిళ్లు తేవడంతో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను మార్చేశారు. ఉమ్మడి జిల్లాలో 600కుపైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇందులో కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండ లాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. రీసర్వే తప్పుల తడకగా మారింది. వీటిని సరిచేయాలని ఉమ్మడి జిల్లాలో వేలాది మంది బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. ఇదిలా ఉండగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది తీవ్ర విమర్శలపాలైంది.

- ఉమ్మడి జిల్లాకు 3.44 లక్షలు
- 40 వేల పుస్తకాల్లో అన్నీ తప్పులే
- పంపిణీ తాత్కాలిక వాయిదా
- రైతాంగానికి మళ్లీ నిరాశ
- ఆన్‌లైన్‌లో సరిచేస్తున్న అధికారులు
- మార్చి కొత్తగా ఇవ్వాలని నిర్ణయం
- గత వైసీపీలో జగన్ బొమ్మ
- కూటమిలో ప్రభుత్వ రాజముద్ర

పొరపాట్లను సరిచేశారనుకుంటే..

ఈ పొరపాటును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిదిద్దింది. కేవలం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించింది. ఇలా ఉమ్మడి జిల్లాకు కొత్తగా 3.44 లక్షల పాసు పుస్తకాలు వచ్చాయి. వీటిని తహశీల్దార్లు పరిశీలించి ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో తప్పులు దొర్లాయని కొందరు వీఆర్వోలు గుర్తించి తహశీల్దార్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో సమాలోచనలు చేశారు. అనంతరం ఆగస్టు 15నుంచి భూయజమా నులకు పంపిణీ చేయాల్సిన పాసుపుస్తకాల పంపిణీ కొంతకాలం వాయిదా వేశారు. ప్రభు త్వం ముందుగా నిర్ణయించిన సమాచారం మేరకు ఇప్పటికే పది రోజుల సమయం దాటి పోయింది. అయినా కొత్త పాసుపుస్తకాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లాలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో కొత్త పాస్ పుస్తకాలు తాత్కాలికంగా దాచి ఉంచారు.

ఇలా చేస్తే బెటర్..

వైసీపీలో రీసర్వే ప్రక్రియలో నాటి వీఆర్వోలు చేసిన తప్పిదాల కారణంగా పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లాయి. ఇలా పునరావృతం కాకుండా ఉండాలంటే భూయజమానుల పేర్లు, రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను థర్డ్ పార్టీ అధికారులతో సర్వే చేయించాలి. గతంలో వీఆర్వో ఫొటోతో కూడిన 1-బీ పత్రాలను రైతులకు పంపిణీ చేసేవారు. రైతుల నుంచి వాస్తవ సమా చార సేకరణ చేసేవారు. కానీ అలాకాకుండా ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న లోపాలతో ఉన్న పాసు పుస్తకాలను ముద్రించి వాటినే తిరిగి పంపిణీ చేయడంతో తప్పుల తడకగా మారుతున్నాయి. ఆ ప్రక్రియకు వీఆర్వోలను వినియోగించకూడదని, రెవెన్యూలో సుదీర్ఘ అనుభవంగల ఒక తహశీ ల్దార్ స్థాయి అధికారి తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగానే ఉన్నట్లు బయోమెట్రిక్ వేసిన రైతులకే పట్టా దారుపాసు పుస్తకాలు థర్డ్ పార్టీ అధికారులతోనే పంపిణీ చేయించాలంటున్నారు. తాజాగా వచ్చిన కొత్త పాసుపుస్తకాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ముద్రితమయ్యాయి.కొత్త పాసు పుస్తకాల్లో రైతు పొలం వద్దకు చేరేలా క్యూ ఆర్ కోడ్ ముద్రించడం విశేషం.



25 బార్లు 20 దరఖాస్తులు

- బార్‌ల దరఖాస్తుల్లో తప్పని డీలా
- ముందుకు రాని వ్యాపారులు
- నేడు లాటరీ ద్వారా కేటాయింపు

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బార్‌లకు దరఖాస్తులు ఉసూరుమంటూనే దాఖలయ్యాయి. నూతన బార్ పాలసీ ప్రకారం బార్‌ల అనుమతులకు దరఖాస్తుల సమర్పణకు ప్రభుత్వం తొలుత ఈ నెల 26 వరకూ గడువు విధించింది. అయితే స్పందన లేకపోవడంతో ఈ నెల 29 (శుక్రవారం) సాయంత్రం వరకూ పొడిగించింది. అయితే చివరి నిమిషంలో దరఖాస్తులు రావడం, కొందరికి అర్హత లేకపోవడం తదితర కారణాల వల్ల ఆలస్యం కావడంతో సమయాన్ని అర్ధరాత్రి 12 గంటల వరకూ పొడిగించారు. అయినప్పటికీ దరఖాస్తుల సంఖ్యలో కిక్కు రాలేదు. జిల్లాకు 22 సాధారణ, 3 కల్లుగీత కార్మికులకు బార్‌లు కేటాయించారు. సాధారణ కేటగిరీ కింద శుక్రవారంలోపు దరఖాస్తు సమర్పించాల్సి ఉంది. రాత్రి 9 గంటల సమయానికి 20 దరఖాస్తులు సమర్పించారు. ఇంకా ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో బార్‌కి కనీసం నాలుగు చొప్పున దరఖాస్తులు వస్తాయని అటు ప్రభుత్వం భావించగా ఏకంగా పదేసి వస్తాయని జిల్లా ఎక్సైజ్ అధికారులు ఊహించారు.ప్రస్తుత వ్యాపారులు వెనుకంజ వేయడంతో.. ఎలాగైనా విజయం సాధించాలనే ఉద్దేశంతో గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లకు కూడా వేలల్లో మెసేజ్‌లు పంపించారు. కానీ చివరికి డీలా ప్రభుత్వ ఖజానాకు గండి తప్పలేదు. బార్‌ల కేటాయింపునకు కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో లాటరీ నిర్వహించనున్నారు.

నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శనివారం నగరంలో పర్యటిస్తారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన చైర్‌పర్సన్‌ను కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా సంక్షేమం, రక్షణ, హక్కుల పరిరక్షణ, జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు,అందుబాటులో ఉన్న వనరులు, భవిష్యత్తు కార్యాచరణ వంటి పలు అంశాలపై చైర్‌పర్సన్‌కి వివరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సూచనలు, మార్గదర్శకాలను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తోందని ఆమెకు కలెక్టర్, ఎస్పీ తెలిపారు. జేఎన్ రోడ్‌లోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే జిల్లా స్థాయి అవగాహన సమావేశంలో పాల్గొంటారని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి.శ్రీదేవి తెలిపారు. మహిళా సాధికారత, భద్రత, హక్కులపై ప్రసంగిస్తారన్నారు. అనంతరం మహిళా పోలీస్ స్టేషన్‌ని సందర్శించి సాయంత్రం తిరుగు పయనమవుతారు.



ఉరకలై గోదావరి

8

పెరుగుతున్న వరద



జ్ఞాన సరస్వతీ పీఠంలో శుభలేక సుధాకర్ శైలజ దంపతులు

నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గాన గంధర్వుడు,పద్మవిభూషణ్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహాన్ని శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్ దంప తులు ఆవిష్కరించనున్నారు.ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో ఘంటసాల విగ్రహం చెంత ఎస్పీ బాలసుబ్రహ్మ ణ్యం విగ్రహాన్ని రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా పార్కు ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహావిష్కరణ అనంతరం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో జీవీ రమణ సంగీత సారథ్యంలో సంగీత విభావరి నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. విగ్రహావిష్కరణకు హాజరైన శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ దంపతులు శుక్రవారం సాయంత్రం పుష్కర్ ఘాట్ వద్ద జ్ఞాన సరస్వతీ పీఠాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాకా కార్యదర్శి జివిరమణ,పీఠం నిర్వాహకుడు తోట సుబ్బారావు స్వాగతం పలికారు. గ్రైడర్ పెన్ వర్క్స్ తరపున సుధాకర్,శైలజ దంపతులకు,గంగుమళ్ళ లక్ష్మణరావు పెన్నులు బహూకరించారు.



కామరాజుపేటలో యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా.. ఏదయ!

- రైతులను వెన్నాడుతున్న ఎరువుల కొరత
- నేటికీ పూర్తిస్థాయిలో అందని వైనం
- కొరతలేదంటున్న వ్యవసాయాధికారులు
- సొసైటీల వద్ద రైతుల పడిగాపులు
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందని ఆరోపణలు

గోకవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులను యూరియా కొరత వెంటాడుతూనే ఉంది. సొసైటీల ద్వారా పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. రైతులకు అందుబాటులో యూరియా ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. దీనికి తోడు ప్రైవేట్ దుకాణాల వద్ద అధిక మొత్తాలకు విక్రయిస్తుండడంతో రైతులకు మరింత భారంగా మారింది. జిల్లాలో సుమారు 73 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు పడుతుండడంతో నీరు కొరత లేక పంట ఏపుగా ఎదుగుతోంది. ఈ తరుణంలో పంటకు యూరియా చాలా అవసరం. సాధారణంగా వరి వేసిన 20 రోజుల్లో ఎరువులు వేయాలి. లేకుంటే పంట చేతికందదు. ఎరువులు అందుబాటులో లేక ఇప్పటికీ పలువురు పూర్తిస్థాయిలో వేయలేదు. ఇప్పటి వరకు జిల్లాకు 47 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 19 మండలాలు ఉండగా ఒక్కో మండలానికి 1987 టన్నుల చొప్పున ఎరువులు సరఫరా చేశారు. మరో 300 టన్నులు చొప్పున ఇండెంట్ పెట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబు తున్నారు.అధికారులు చెబుతున్న లెక్కలు బాగు న్నా జిల్లాను ఎరువుల కొరత వేధిస్తోంది.

యూరియా ఏమైంది!

ఒక పక్క అధికారులు చూస్తే యూరియా కొరత లేదంటున్నారు..మరో పక్క రైతులు చూస్తే కొరత అంటున్నారు..ఆరంభం నుంచి యూరియాకు సొసైటీల వద్ద క్యూకడుతూనే ఉన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, కోరుకొండ, గోకవరం, చాగల్లు తదితర మండలాల్లో రైతులు యూరియాకు పడిగాపులు కాసిన ఘటనలు ఉన్నాయి. మరి ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా ఏమైపోయింది.. బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందా.?జిల్లా వ్యవసాయాధికారి లెక్కల ప్రకారం అదనంగా 4 వేల మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశారు. మరి ఆ యూరియా అంతా ఏమైంది.. జిల్లా అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సి ఉంది. ప్రభుత్వం బస్తా యూరియా రూ.266కు విక్రయిస్తుండగా..ప్రైవేట్ వ్యాపారుల వద్ద అదే బస్తా రూ.350ల నుంచి రూ.400లకు విక్రయిస్తున్నారు. యూరియాకు డిమాండ్ పెరగడంతో కొంతమంది పక్క దారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇదీ జిల్లా అధికారుల లెక్క..

జిల్లాకు ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 61,692 మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉండగా ఆగస్టు నెలకే 47 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి.(అక్టో బరు వరకు) సుమారుగా 14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే 5 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఎక్కువగా దిగుమతి జరిగింది. జిల్లాలో 16,556 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి.వీటిలో యూరియా 1917 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2112, పొటాష్ 2411, కాంప్లెక్స్ 6462, సూపర్ ఫాస్ఫేట్ 3654 మెట్రిక్ టన్నులు.జిల్లాకు 26,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికి 19 వేల మెట్రిక్ టన్నులు అందింది. రైతుల సాగు చేసిన పంట విస్తీర్ణాన్ని బట్టి 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరిపోతుంది.4 వేల మెట్రిక్ టన్నులు అదనంగా సమకూర్చాం.ఇంకనూ (అక్టోబరు నెల వరకు) సుమారుగా 7,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుంది.రైతులు సాగు చేసిన పంట విస్తీర్ణం బట్టి యూరియా పంపిణీ జరుగుతుంది. అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి.

ఆర్ఎస్‌కేలు..అలంకారమా?

జిల్లాలో రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువుల అమ్మకాలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. దీనిపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆర్‌బీకేల వద్ద అమ్మకాలు జరిగాయి.కూటమి ప్రభుత్వంలో ఆర్ఎస్‌కేల వద్ద ఎరువుల విక్రయాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం ఆ బాధ్యతలు మోయలేక తప్పించుకోవాలనే ధోరణిలో ఉన్నారు.గోకవరం సొసైటీ పరిధిలో ఇంత వరకు 70 టన్నులు, కామరాజుపేట సొసైటీ పరిధిలో 50 టన్నులు మాత్రమే యూరియా రైతులకు అందగా రెట్టింపు యూరియా అందాల్సి ఉంది.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి : కలెక్టర్



రీసర్వేపై లెక్కలు తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం రీ సర్వే, స్వమిత్వ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.కోరుకొండ ఎంపీడీవో కార్యాల యంలో శుక్రవారం స్వమిత్వరీ సర్వే పనులపై కలెక్టర్ సమీక్షించారు. రీ సర్వే లో ఇంకా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పర్యవేక్షణాధికారులు తమ బాధ్యతలను ఖచ్చితంగా నిర్వర్తించాలన్నారు. ప్రజలకు పౌర సేవలు అందించే క్రమంలో నిర్లిప్తత వహిస్తే ఊరుకోనని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో డాక్యుమెంట్లు సమకూర్చే బాధ్యత ఎంపీడీవోలదే, సాంకేతిక సహ కారం అందించే బాధ్యత తహశీల్దార్లదేనన్నారు. డేటా ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండకూడదన్నారు.కోరుకొండ మండలంలో రీసర్వే అన్ని గ్రామాలు పూర్తయ్యాయని చూపడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, డిప్యూటీ ఎంపీడీవో బి. మహేష్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

2న మండల సర్వసభ్య సమావేశం

కొవ్వూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల రెండో తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో వీవీఎస్ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఇందులో మండలంలోని వివిధగ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందన్నారు.

గణనాథులకు పూజలు



పట్టణంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వాడవాడలా కొలువైన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్దగల 23వ వార్డు రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహానికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లో వేంచేసియున్న 18 అడుగుల వినాయ విగ్రహం వద్ద భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబా మాట్లాడుతూ 103 వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సాయంత్రం 6 గంటల్లోపే నిమజ్జనాలు చేయాలి

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలను సాయంత్రం ఆరు గంటలలోపు జరపాలని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గోదావరీ పరీవాహక ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని గస్తీగా నియమించామన్నారు. మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులతో ఏకాదశి సహస్ర గలార్చన



మల్లేశ్వరం పాఠశాలలో ఏకాదశి సహస్ర గాలార్చన చేస్తున్న విద్యార్థులు

పెరవలి, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం మల్లేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులతో ఏకాదశి సహస్ర గలార్చన, తెలుగు బాల శతకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పద్యాలను రాఘయుక్తంగా విద్యార్థులు ఆలపించారు. పెరవలికి చెందిన మాతృభాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వ ర్యంలో వందకు పైగా పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం జీ. మునమ్మ, ఉపాధ్యాయులు చెంచు లక్ష్మి, రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టయితే చట్టరీత్యా చర్యలు తప్పవని కొవ్వూరు పట్టణ సీఐ పీ.విశ్వం హెచ్చరించారు. శుక్రవారం వాడపల్లి సుమా పాఠశాలలో బాలికల ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మహిళా పోలీసులు శక్తి యాప్, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మొబైల్ వినియోగంతో ఎన్నో అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు , తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకి ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



చెట్టుకు వేళాడుతున్న సైదుఏసు మృతదేహం

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధి తిరుగుడు మెట్టలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలివి.. తిరుగుడు మెట్టకి చెందిన సైదుఏసు (26) గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈయనకు ఆరు సంవత్సరాల క్రితం వివాహమయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం భార్య మృతి చెందింది. దీంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆయన తల్లి పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టీ. రామకృష్ణ తెలిపారు.

అమ్మ భాష.. తెలుగు భాష

● ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా మాతృభాషా దినోత్సవం ● పెద్దసంఖ్యలో హాజరైన టీచర్లు, విద్యార్థులు



తెలుగు పద్యాల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం



గోపాలపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ...



గిడుగు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్

నల్లజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం మరువలేనిదని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి సిరిమువ్వ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దూబచర్ల ఎలైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం-క్రీడా దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారి జగృతి చూపిన ప్రతిభ అసాధారణమన్నారు. అలాగే ఎలైట్ చిన్నారుల వేమన ,సుమతి శతకం నుంచి 108 పద్యాలను ఆలపించడం ఎంతో సంతోషకరమన్నారు.

చిన్నారి జాగృతి అసాధారణ ప్రతిభ

11 సంవత్సరాల నారాయణం జాగృతి సభలో అసాధారణ ప్రతిభ ప్రదర్శించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రముఖుల సమక్షంలో నాలుగు నిమిషాల్లో 100కు పైగా కఠిన తెలుగు పదాలకు అర్థాలు చెప్పడం (69వ రికార్డు), ఎటు నుంచైనా చదివే భ్రమక పదాలు మూడు నిమిషాల్లో (70వ రికార్డు)100కు పైగా హిందీ పదాలకు తెలుగు, ఇంగ్లీషు అర్థాలు ఆరు నిమిషాల్లో (71వ రికార్డు)100కు పైగా సంధి పదాలకు విసంధి రూపాలు 9 నిమిషాల్లో 74వ రికార్డు, 75మంది భారతీయ క్రీడాకారుల ముఖ చిత్రాలు, వారి క్రీడాలను గుర్తించడం (75వ రికార్డు) సాధించింది. ఎల్ఐసిఐ అభివృద్ధి అధికారి కూన అప్పారావు, ఏలూరు విజన్ లైన్స్ క్లబ్ ప్రతినిధి పాతూరి ప్రభాకర్, కోచ్చర్లకోట శ్రీనివాస్, ఎలైట్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దావులూరి ప్రభాకరావు, డైరెక్టర్స్ యలమర్తి సుదర్శన్ రావు, గారపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గిడుడు రామ్మూర్తి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, తెలుగుభాష ఒక చారిత్రాత్మక భాష అని తెలిపారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు అనురాధ, పాప ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిరస్మరణీయుడని ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తెలుగుతల్లి వేషధారణలో పలు ప్రదర్శనలు చేశారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తెలుగు అక్షరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్ పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల, చైతన్య స్కూల్, భాష్యం స్కూల్‌లో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నతికి గిడుగు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో ఆనంద్‌ప్రసాద్, అధ్యాపకులు ఎస్.వెంకటేశ్, ప్రియాంక, రాము, శ్రీనివాస్, భాష్యం స్కూల్ ఏజీఎం పార్థసారధి, కోఆర్డినేటర్ రామారావు, జోనల్ ఇన్‌చార్జి కవి తారాజేశ్వరి, స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, చామ్స్ ప్రిన్సిపాల్ షబానా, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నారుమడులు కట్టేవారు బోర్డు అనుమతి తీసుకోవాలి

● దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత



విలేకరులతో మాట్లాడుతున్న ఏఎస్ హేమస్మిత

దేవరపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పొగాకు నారు మడులు కట్టేవారు బోర్డు అనుమతి తప్పనసరిగా తీసుకోవాలని దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత పేర్కొన్నారు. శుక్రవారం పొగాకు వేలం కేంద్రంలో ఆమె విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం పల్లంట్లలో పొగాకు నారుమడులను పరిశీలించారు. హేమస్మిత మాట్లాడుతూ 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతించటం జరిగిందన్నారు. గత సంవత్సరంలో అధిక ప్రమాణంలో పండించిన పంట వల్ల రైతులు వేలం కేంద్రాల్లో పొగాకు అమ్ముకోవడానికి ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం ఈ ఏడాది పొగాకు బోర్డు నిర్ణయించిన పంట పరిమితి మేరకు పండించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఎకరానికి రూ200 చెల్లించాలన్నారు. బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నారుమడులు కడితే కఠిన తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రీవెన్స్ : ఎమ్మెల్యే



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, పాలూరి నీలిమ, నేతలు బోడపాటి ముత్యాలరావు, కొప్పాక జవహర్ , టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పేద ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ. 2,30,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, పాలూరి నీలిమ, నాయకులు బోడపాటి ముత్యాలరావు, కొప్పాక జవహర్ , టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌కు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

తాళ్లపూడి: రాగోలపల్లికి చెందిన పిల్లిబోయిన రమేష్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 29 వేల చెక్కు మంజూరవ్వగా, దాన్ని శుక్రవారం కొవ్వూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత చలపాటి ప్రకాష్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తరువాత పేద కుటుంబాల ఆరోగ్య సేవలకై సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర వెలుగు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోపాలపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళల విద్య నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని జిల్లా నోడల్ అధికారి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో రాజమనోహర్ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షర వెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో నిరక్షరాస్యులుగా ఉన్న 3300 మంది మహిళలను గుర్తించినట్టు తెలిపారు. వారికి అక్షరాలు నేర్పించేందుకు 10 మందికి ఒక్కొక్కరు చొప్పున 330మంది వలంటీర్లను ఏర్పాటు నియమించామన్నారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, ఏపీఎం రోజ్ మాణిక్యం, ఏపీవో జేవీ రమణ, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో బాధితులకు అధిక మొత్తంలో పరిహారం అందజేసే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మీ సూచించారు. ఈ మేరకు విద్యుత్, టెలీఫోన్, బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులతో ఆమె శుక్రవారం సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. రాజీకి అర్హమైన అన్ని కేసులను పరిష్కరించే దిశగా చర్చించారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన పోలవరం జేసీ

కడియం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఎక్స్ అఫీషియల్ జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ శుక్రవారం కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి స్వాగతించారు. పలురకాల స్వదేశీ, విదేశీ మొక్కలను జేసి పరిశీలించి వాటి విశిష్టతను, ప్రత్యేకతలను అడిగారు. మొక్కల అందాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మునికూడలి దేవాన్ష్ ఘాట్‌లోనే నిమజ్జనం చేయాలి

సీతానగరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక నిమజ్జనాలు మునికూడలిలోని దేవాన్ష్ ఘాట్‌లో మాత్రమే చేయాలని తహశీల్దార్ ఏ.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సదరు ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున నిమజ్జనానికి అనుకూలంగా గుర్తించామన్నారు.

భూయజమానులకు న్యాయం జరిగేలా చూస్తా

దివాన్‌చెరువు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువుకు మంజూరైన ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ విషయంలో యజమానులకు నష్టం జరగకుండా న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ భూసేకరణ విషయమై కొందరు యజమానుల నుంచి అభ్యంతరాలు రావడంతో శుక్రవారం ఇక్కడకు వచ్చి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భూయజమానులు మాట్లాడుతూ 2018లో ఒకసారి సర్వే చేశారని ఆ అవార్డు కాపీలో పేర్కొన్న భూమి కంటే ఎక్కువ భూమిని ప్రస్తుతం అధికారులు తీసుకుంటున్నారని వాపోయారు. తమ వద్ద సేకరించిన భూమి మేరకే తమకు పరిహారం చెల్లించారని తెలిపారు.

21 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 21 నుంచి 28వ తేదీ వరకూ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సిటీ బ్యాడ్మింటన్ కోర్టులు, బొప్పన స్పోర్ట్సు క్లబ్‌లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్సు హబ్‌గా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీకి అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌గా పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మద్దూరి శంకర్, బెజవాడ వెంకట్, చిట్టూరి రాంబాబు, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తైవాన్‌లో ఉద్యోగావకాశాలు మెండు

» న్యూఢిల్లీ టీఈసీసీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌జి యాంగ్ » జీజీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆసక్తి ఉన్న విద్యార్థులకు తైవాన్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని న్యూఢిల్లీ టీఈసీసీ (తైవాన్)సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌జీ యాంగ్ పేర్కొన్నారు. జీజీయూలో హరిత ఆర్థిక వ్యవస్థ-స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీఎస్) కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది.

ఈ సందర్భంగా జీజీయూ వీసీ యు. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో యాంగ్ మాట్లాడుతూ సెమీ కండక్టర్ల సాంకేతికతలో జీజీయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆసక్తి ఉంటే ఉద్యోగవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. తైవాన్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. వీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇండో-తైవాన్ ప్రాజెక్టులపై విద్యార్థులు పనిచేసేందుకు జీజీయూ నుంచి తైవాన్‌కు పంపించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీజీయూ ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న 'గోదావరి'



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద నీరు

కొవ్వూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో గోదావరి నదిలో వరద వేగంగా పెరుగుతోంది. పోటెత్తింది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నదీ పరివాహక ప్రాంతాలలో వాగులు, ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన ఉన్న ప్రాజెక్టులు, రిజర్వాయర్‌లు, ఉపనదులు వరద నీటితో నిండు కుండలను తలపిస్తున్నాయి. దీంతో గత నెల రోజులుగా గోదావరి నదిలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. వరద తగ్గుతూ, పెరుగుతూ దోబూజులాడుతుంది. కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య అఖండ గోదావరిలో ఎగువ నుంచి వరద ప్రవాహం వచ్చి చేరడంతో హోరున శబ్దం చేస్తూ ఉప్పొంగి ప్రవహిస్తుంది. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే నీటిమట్టాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలు మరోసారి నీట మునిగాయి. దీంతో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుం డా క్షేత్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గోదావరి నదికి వరద పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తున్నందున నిమజ్జనాలను పోలీసు అధికారులు సూచించిన ప్రదేశాలలో మాత్రమే చేయాలని పట్టణ సీఐ విశ్వం హెచ్చరించారు. ఊరేగింపులో చిన్నపిల్లలను తీసుకురావద్దన్నారు.

ధర్మవరంలో జాతీయ క్రీడా దినోత్సవం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

కొవ్వూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూర్వ విద్యార్థి, గీత ముళ్ళపూడి ఇంటర్నేషనల్ దంత వైద్యశాల డాక్టర్ ముళ్లపూడి రాజేంద్రప్రసాద్ రూ. ఐదు వేల విలువైన బహుమతులను పంపిణీ చేశారు. దీనిలో భాగంగా జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారిణి కడియం మహాలక్ష్మిని అభినందించారు. పాఠశాల హెచ్ఎం బీ.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్యాయం జరిగితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

నల్లజర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని జిల్లా దివ్యాంగుల కుల పోరాట సమితి అధ్యక్షుడు భీమడోలు కిరణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగుల హక్కుల కోసం 2007లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ప్రవేశపెట్టిన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నేటితో 18 వసంతాలు పూర్తిచేసుకోవడం ద్వారా శుక్రవారం ఆవిర్భావ వేడుకను ఎంఎస్‌పీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్లపూడి ఏసుదాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ దివ్యాంగులకు 35 కేజీల బియ్యంకార్డు, మూడుసెంట్ల స్థలం కేటాయించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బయ్యర్పు నాగేశ్వరరావు, అప్పారావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కండెల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

152 మందికి కంటి వైద్యపరీక్షలు

చాగల్లు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని టీడీపీ నేత కరుటూరి సతీష్ హాజరై ప్రారంభించారు. మొత్తం 152 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 28 మందికి కంటిఅద్దాలు, 21 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. నిడదవోలు లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వారు వచ్చి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వల్లిపల్లి వెంకట రామారావు, సభ్యులు పిచికల వెంకట సత్యనారాయణ, కే. నాగేశ్వరరావు ఆళ్ల సత్తిబాబు, కోడూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లపూడి శ్రీవిజేత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా విద్యార్థులంతా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జొన్నకూటి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో తాళ్లపూడి హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయిన చామర్తి విశ్వనాథరావును గిడుగు సాహితీ పురస్కారంతో గౌరవిస్తూ ఘనంగా సన్మానించారు. విశ్వనాథరావు మాట్లాడుతూ తెలుగు భాషా ప్రాముఖ్యత, ప్రాధాన్యత గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు అలీ, రాజు, వెంకట్, విజయ్, కరుణ, చంద్రిక పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ



వడ్లూరులో రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్తులకు వడ్లూరులో శుక్రవారం పోషకాహార కిట్లను పీహెచ్‌సీ డాక్టర్ ఆర్. ఉషాదేవి, స్థానిక నేతలు అందజేశారు. డాక్టర్ ఉషాదేవి మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే కుటుంబసభ్యులతో కలసి మెలసి తిరిగేటపుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యాధి సోకినవారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. ఆ సమయంలో నెలకి రూ. వెయ్యి చొప్పున బ్యాంకుఖాతాలో జమఅవుతాయని చెప్పారు. 20 మంది రోగులకు ఈ కిట్లను అందజేశారు. ఈ గ్రామంలో టీబి రోగులను దత్తత తీసుకుని వారికి పౌష్టికాహారం అందిస్తున్న సర్వారాయషుగర్ లిమిటెడ్ ప్రతినిధి హెచ్ఆర్ శ్రీధర్‌ను వైద్యసిబ్బంది, గ్రామస్థులు ఈ సందర్భంగా అభినందించారు.